


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ.5,18,329
బంగారం : 750 మిల్లీ గ్రాములు
వెండి : 19 గ్రాములు - భువనేశ్వర్/పూరీ

కమల దళపతి ఎవరో..?

రాష్ట్రంలో అధికార పక్షం భారతీయ జనతా పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకోనుంది.



- 8లో



భక్తిశ్రద్ధలతో బహుడా

తొమ్మిది రోజుల పాటు గుండిచా మందిరంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన జగన్నాథుడు సోదరి సుభద్ర, సోదరుడు బలభద్రుడితో కలిసి శనివారం తిరిగి మందిరానికి బయల్దేరాడు.

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి



లావణ్య గంట (ఫైల్)

రాయగడ: మారు రథయాత్రలో విధులు నిర్వహించేందుకు తన సొంత గ్రామమైన ఖిదాపడ నుంచి స్కూటీపై రాయగడ వస్తున్న మహిళా కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యారు. మృతురాలు లావణ్య గంట (24)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. చందిలి పోలీసుస్టేషన్ పరిధి గునాఖాల్ రోడ్డు కూడలి వద్ద లావణ్య నడుపుతున్న స్కూటీని వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో ఆమె తన ఎదురుగా వస్తున్న లారీకింద పడిపోవడంతో తీవ్రగాయాలపై సంఘటన స్థలంలోనే మృత్యువాతపడింది. బైక్‌పై వస్తున్న బిసంకటక్ పరిధి మునిగా గ్రామానికి చెందిన కాంతారావు కద్రక, సుబ్బారావు కద్రకలు కూడా కిందపడిపోయి తీవ్రగాయాలకు గురై స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కానిస్టేబుల్ లావణ్య మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి

- మాజీ మంత్రి, ఆదివాసీ నేత జయరాం పంగి డిమాండ్



జయరాం పంగి

జయపురం: దండకారణ్య ప్రాంతంలో ఆదివాసీ ప్రాంతాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, అవిభక్త కొరాపుట్ ఆదివాసీ నేత, దండకారణ్య పర్వతమాల వికాస పరిషత్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు జయరాం పంగి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. కొరాపుట్, నవరంగపూర్, రాయగడ, మల్కన్‌గిరి, గజపతి జిల్లాలతో పాటు ఆంధ్ర ప్రదేశ్‌లోని పార్వతీపురం, పాడేరు ప్రాంతాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తన డిమాండ్‌కు ఆ ప్రాంతాల నేతలు, ప్రజలు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. స్వతంత్ర రాష్ట్రం ఏర్పడితే ఇంతవరకు ఒడిశా- ఆంధ్ర రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలు సమసిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిరుత దాడిలో 5 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి కుమారపూట్ గ్రామంలో శుక్రవారం రాత్రి చిరుత దాడిలో మేకలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సమారీ దాంగ డమాఝి అనే వ్యక్తి తన మేకలను ఒక శాలలో కట్టి ఇంటికి వెళ్లాడు. అయితే శనివారం ఉదయం వచ్చి చూస్తే 5 మేకలను పులి చంపి పడేసింది. ఒక మేకను పులి ఈడ్చుకొని వెళ్లినట్లు ఆనవాలు ఉన్నాయి. ఈ విషయంపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మత్తిలి రేంజర్ వాసుదేవ్ నాయక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఒక్కో మేకకు పరిహారంగా రూ.3,000 చొప్పున రైతుకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



సంఘటన స్థలంలో మృతదేహం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందింది. శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి కొలనార సమితి సూరి పంచాయతీలోని బొడొపాడియా గ్రామానికి చెందిన పెంటి ఉలక(64)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్యాంకు పనిమీద పెంటి తన బంధువులతో స్కూటీపై వస్తోంది. అదే సమయంలో స్థానిక జియోమార్ట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఒక బస్సు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన ఆమె సంఘటన స్థలం వద్దే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీమందిరం సింహద్వారం వద్దకు చేరిన రథాలు



నృత్యాలు చేస్తున్న కళాకారులు



పూరీ శ్రీజగన్నాథుని మారు రథయాత్ర బహుడా సందర్భంగా సాగర తీరంలో సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ సైకత శుభాకాంక్షలు

జగతినాథ జయహో..!

- ఘనంగా మారు రథయాత్ర
- శ్రీమందిరం చేరిన రథాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు



కదులుతున్న జగన్నాథుడి రథం

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథయాత్ర ద్వితీయ ఘట్టం బహుడా అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. అధికారులు, సేవాయత్ వర్గాల మధ్య సమన్వయంతో యాత్ర పూజాదులు నిర్ధారిత వేళ కంటే ముందుగా పూర్తి చేయడంతో అడప మండపం నుంచి వరుస క్రమంలో రథాలపైకి మూలవిరాటుల తరలింపు పొహండి ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. మూల విరాటులు తరలి వస్తుండగా శారదా బాలి ప్రాంగణం శంఖ ధ్వని, ఘంటానాదంతో మారుమోగింది. భక్తుల జైజగన్నాథ్ నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణం అలముకుంది. ఔత్సాహిక కళాకారులు భక్తిశ్రద్ధలతో రథాల ఆవరణలో శాస్త్రీయంగా నృత్యం ప్రదర్శించి భక్తజనం దృష్టిని ఆకట్టుకున్నారు.

ఆసీనులైన దేవతామూర్తులు

తొలుత చక్రరాజ్ సుదర్శనుడు గుండిచా ఆలయం అడప మండపం నుంచి తరలివచ్చి దేవీ సుభద్ర రథం దర్ప దళనంపై ఆసీనుడయ్యాడు. వెంబడి తాళధ్వజంపైకి బలభద్రుని మూలవిరాటు చేరింది. దేవీ సుభద్ర దర్ప దళనంపైకి చేరడంతో, చివరగా శ్రీజగన్నాథుడు నందిఘోష్ రథంపై ఆసీనుడు అయ్యాడు. వెంబడి మూలవిరాటుల ఉత్సవమూర్తులను రథాలపైకి వరుస క్రమంలో తరలించడంతో పొహండి ముగిసింది. ఉదయం 9.55 గంటలకు ప్రారంభమైన పొహండి మధ్యాహ్నం 12.30 గంటలకు ముగిసింది. అంతకు ముందు మంగళ హారతి, మైలం వంటి అనేక ఆచారబద్ధమైన పూజలు, సేవాదులు నిర్వహించారు. మూల విరాటులు రథాలపై ఆసీనులు కావడంతో పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ చెర పహరా కార్యక్రమంలో పాల్గొని 3 రథాలను శుద్ధి చేశారు. అనంతరం రథాల మారుయాత్ర ప్రారంభమైంది.

మధ్యాహ్నం 2.45 గంటలకు ప్రారంభం

తొలుత బలభద్రుని తాళధ్వజం మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరింది. వాస్తవానికి రథాలు లాగడం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించబడుతుందని ప్రకటించారు. ఆ తర్వాత దేవి సుభద్ర దర్ప దళనం యాత్ర ప్రారంభించింది. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య శ్రీజగన్నాథుని నందిఘోష్ రథం దారి పొడవునా ఆత్మీయుల్ని పలకరించుకుంటూ నిదానంగా శ్రీమందిరం గమ్యం చేరింది. దారిలో బాలగండి చౌరస్తా ప్రాంతంలో మాసీ మా (పిన్నమ్మ) ఆలయం ఆవరణలో నందిఘోష్ రథం ఆనవాయితీ ప్రకారం కాసేపు ఆగింది. యాత్ర ముగించుకుని శ్రీమందిరానికి చేరబోతున్న జగతినాథునికి పిన్నమ్మ ప్రేమతో తయారు చేసిన తీపి వంటకం పొడొ పిఠా మట్టి పాత్రలో నివేదించింది. ఏటా మారు రథయాత్ర ముందు రోజున మాసీ మా ఆలయంలో ఈ వంటకం సిద్ధం చేస్తారు. ఈ సాంప్రదాయ ఒడియా రుచికరమైన వంటకం గోధుమ పిండి, చెన్నా (విరిగిన పాలు), చక్కెర, పిస్తాపప్పులు, ఏలకులు, లవంగాలు మరియు శుద్ధ నెయ్యిల గొప్ప మిశ్రమంతో తయారై ఘుమఘుమలాడుతు రుచికరంగా ఉంటుంది. మాసీ మా ఆలయం నుంచి ప్రారంభమైన శ్రీ జగన్నాథుని రథం మరోమారు గజపతి మహారాజా భవంతి ఆవరణలో ఆగింది. అన్నాచెల్లెళ్లతో యాత్రకు వెళ్లి తనను ఒంటరి చేశారన్న మనస్తాపంతో కలత చెందుతున్న శ్రీమహాలక్ష్మీ దేవిని బుజ్జగించి నచ్చజెప్పడంలో గజపతి మహారాజా రాయబారిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ముచ్చట గొలిపే లక్ష్మీ నారాయణుల భేటీ అత్యంత భక్తిశ్రద్ధలతో భక్త జన సంద్రం సమక్షంలో జరిగి యాత్రలో ఆకర్షణీయ ఘట్టంగా నిలిచిపోతుంది.



శ్రీజగన్నాథునికి పిన్నమ్మ నివేదించిన పొడొ పిఠా



రథాల శుద్ధి చేస్తున్న గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్

ఎట్టకేలకు..!

- కొరాపుట్ - జయపూర్ మార్గంలో కదిలిన రైలు



ప్రయోగాత్మకంగా వెళ్తున్న గూడ్స్ రైలు



తైడా స్టేషన్ యార్డు పరిశీలిస్తున్న డీఆర్ఎం, ఇతర ఉన్నతాధికారులు

కొరాపుట్: కొరాపుట్-జయపూర్ రైల్వేమార్గంలో ఎట్టకేలకు రైలు కదిలింది. శనివారం రాత్రి గూడ్స్ రైలుని రైల్వే అధికారులు ప్రయోగాత్మకంగా నడిపారు. రైలు విజయవంతంగా నడిచింది. కొత్తవలస-కిరండోల్ రైల్వే మార్గంలో జయపూర్-కొరాపుట్ స్టేషన్ల మధ్య జరతి - మాలిగుడ మార్గంలో కొండ చరియలు ట్రాక్ మీదకు చొచ్చుకు వచ్చిన విషయం పాఠకులకు విదితమే. బుధవారం ఈ ఘటన జరగగా శుక్రవారం నాటికి మట్టి తొలగించారు. అనంతరం ట్రాక్ మరమ్మతులు చేపట్టి తొలి రైలు నడిపారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోరా ఈ మార్గంలో పర్యటించారు. కొత్తవలస - కొరాపుట్ - మాలిగుడ సెక్షన్‌లో వర్షాకాలంలో వచ్చే అవాంతరాలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మాలిగుడ నుంచి కొత్తవలస వరకు ప్రయాణం చేసి పరిస్థితులు పరిశీలించారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

కాగా ఈ మార్గంలో రైళ్ల రద్దు కొనసాగుతోంది. శనివారం జగదల్‌పూర్-పూరీ, రౌర్కెలా-జగదల్‌పూర్, భువనేశ్వర్-జగదల్‌పూర్, 6వ తేదీన విశాఖపట్నం-పూరీ, జగదల్‌పూర్-రౌర్కెలా, జగదల్‌పూర్-భువనేశ్వర్, 7వ తేదీన పూరీ-జగదల్‌పూర్, పూరీ-విశాఖపట్నం రైళ్లు రద్దయ్యాయి. అలాగే ఈ మార్గంలో కొరాపుట్-జగదల్‌పూర్-కిరండోల్ మార్గంలో నడిచే రైళ్లు 7వ తేదీ వరకు రద్దయ్యాయి. ఈ రైళ్లన్నీ కొరాపుట్ వరకు వచ్చి తిరిగి వెళ్తాయి. భువనేశ్వర్, కోల్‌కత, రౌర్కెలా, విశాఖపట్నంల నుంచి వచ్చే రైళ్లు కొరాపుట్ వరకు వచ్చి తిరిగి వెనక్కి వెళ్తాయని రైల్వే శాఖ ప్రకటించింది.

రాజకీయాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలి

- మంత్రి సూర్యవంశీ సూరజ్

రాయగడ: దేశ రాజకీయాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలని రాష్ట్ర క్రీడలు, ఉన్నత విద్య, సాంస్కృతిక శాఖల మంత్రి సూర్యవంశీ సూరజ్ ఆకాంక్షించారు. ఒక్కరోజు పర్యటనకు శుక్రవారం రాయగడ వచ్చిన ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం స్థానిక సిరిగుడ సమీపంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. యువత ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తుంటారని, అయితే రాజకీయాలపై అంతగా ఆసక్తి కనబర్చకపోవడం విచారకరమన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే అందుకు ఆసక్తితో పాటు సేవాభావం కలిగి ఉండాలని సూచించారు.

మరింత బలోపేతం కావాలి

రాజకీయంగా ఎదగడంతో పాటు పార్టీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని మంత్రి సూరజ్ అన్నారు. ముఖ్యంగా దక్షిణ ఒడిశాలో పార్టీ మరింత బలం పుంజుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాతో పాటు దక్షిణ ఒడిశాలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక సిద్ధమవుతోందని తెలియజేశారు. రానున్న పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ తన ఉనికిని చాటుకునేవిధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన ఈ జిల్లాల్లో బీజేపీ జెండా ఎగురవేయాలంటే ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్, యాల్ల కొండబాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయనకు ఘన స్వాగతం పలికి, పార్టీ కార్యాలయంలో సత్కరించారు.



గజమాలతో మంత్రి సూరజ్‌ను సత్కరిస్తున్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు



బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సూరజ్

చదువు సాగాలంటే.. నదిని దాటాల్సిందే..!

అక్షరాలు నేర్చుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు అక్కడి గిరిజన విద్యార్థులు. చదువుకోవాలనే ఆశయంతో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నదిని నడుకుంటూ దాటుతున్నారు. కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి పిండాపాదర్ గ్రామ పంచాయతీ శేషకుడి గ్రామ ప్రజలు అంధారి నది దాటుతున్న దృశ్యమిది. గత వారం రోజులుగా వర్షాల వలన పిల్లలు చదువులకు వెళ్లలేకపోయారు. ఇలా అయితే తమ పిల్లలు తమలాగే వెనుకబాటుతనానికి గురవుతారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చిన్నారులను తమ భుజాల మీద కూర్చొనబెట్టి ప్రమాదకర పరిస్థితిలో నదిని దాటించారు. ఈ గ్రామంలో 280 మంది జనాభా నివసిస్తున్నారు. దీంతో నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని దశాబ్దాలుగా పాలకులను వేడుకుంటున్నా తమ మొర వినడం లేదని వాపోతున్నారు. కనీసం పాద వంతెన నిర్మించినా తమ ప్రాణాలకు భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ఇలాగే ప్రతిరోజు రెండు పూటలు గిరిజనులు పిల్లలను పాఠశాలకి పంపించడం, తీసుకొని రావడం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామస్తులు కూడా తమ జీవనోపాధి కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నదిని దాటుతున్నారు.

- కొరాపుట్





క్లుప్తంగా

విద్యుత్ చార్జీలను తగ్గించాలి


ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న సీపీఎం శ్రేణులు

అరసవల్లి: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై చార్జీల పేరుతో మోపుతున్న భారాన్ని వెంటనే తగ్గించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ధరలను పెంచబోమని మాటిచ్చి ఇప్పుడు దఫదఫాలుగా పెంచుతూ పోతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఈపీడీసీఎల్ డైరెక్టర్


సూర్యప్రకాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చక్రవర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి.సూర్యప్రకాష్ శనివారం దర్శించుకున్నారు. జిల్లా సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తితో పాటు ఆలయ అధికారులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు మాధవ్‌శర్మ, ఆలయ అధికార సిబ్బంది బిఎస్.చక్రవర్తి తదితరులు ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, డీ–1 ఏఈ సురేష్‌కుమార్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు పాల్గొన్నారు.

విశ్రాంత ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా తవిటన్న

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదవీ విరమణ పొందిన ట్రెజరీ ఉద్యోగులు శనివారం సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చే ఇబ్బందులు, సంక్షేమాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టేందుకు టీఆర్ఈడబ్ల్యూఏ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ట్రెజరీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అంకడాల తవిటన్న, ఉపాధ్యక్షుడిగా భీష్మాచార్యులు, కార్యదర్శిగా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎ.కోటేశ్వరరావు, కోశాధికారిగా ఆర్ఎస్ పట్నాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రయ్య, డిప్యూటీ ట్రెజరీ ఆఫీసర్ వెంకటరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా అండర్-15 చెస్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–15 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఆదివారం జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలోని చెస్ శిక్షణా కేంద్రంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఎంపికల్లో పాల్గొనాలని, పూర్తి వివరాలకు 99125 59735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో వివరాలను నమోదుచేసుకోవచ్చని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బొడ్డేపల్లి రమేష్‌కుమార్



ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆమదాలవలస పట్టణానికి చెందిన బొడ్డేపల్లి రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఈయన 2013 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు రమేష్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఆప్కో వస్త్రాలపై రాయితీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో షోరూంలలో ఆషాఢ మాసం సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 50 నుంచి 70 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు డివిజనల్ మార్కెటింగ్ అధికారి అనుపమదాస్ శనివారం తెలిపారు. ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చీరలు, బెడ్‌షీట్స్, లుంగీలు, టవల్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆప్కో హేండ్‌లూమ్స్.కామ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ ఆప్కో వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బహుడా

తొమ్మిది రోజుల పాటు గుండిచా మందిరంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన జగన్నాథుడు సోదరి సుభద్ర, సోదరుడు బలభద్రుడితో కలిసి శనివారం తిరిగి మందిరానికి బయల్దేరాడు. దీనినే మారు రథయాత్ర(బహుడా)గా పిలుస్తారు. గండిచా మందిరంలోని దేవతామూర్తులను రథంపైకి ఎక్కించి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో రథాలు లాక్కొని వెళ్లారు. దేవతామూర్తుల రథాలు సాంప్రదాయం ప్రకారం మార్గమధ్యలోని తమ పిన్ని ఇంటి వద్ద ఆగాయి. అక్కడ దేవతామూర్తులు ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం విడిది చేస్తారు. భక్తుల పూజలందుకున్న అనంతరం ప్రధాన మందిరానికి రథాలు బయల్దేరుతాయి.

- సాక్షి నెట్‌వర్క్


కొరాపుట్: యాత్రను తిలకిస్తున్న గిరిజనులు


పర్లాకిమిడి: చెరా పహారా చేస్తున్న కల్యాణీ దేవి గజపతి


రాయగడ: రథయాత్రలో భక్తుల సందడి


జయపురం: దేవతామూర్తులకు భోగం సమర్పించేందుకు వేచి ఉన్న భక్తులు


పర్లాకిమిడి: జగన్నాథ స్వామివారిని నందిఘోష్ రథంపైకి ఎక్కిస్తున్న సేవాయత్‌లు


పర్లాకిమిడి: గుండిచా మందిరం వద్ద పోలీసు భద్రత


జయపురం: జయపురంలో మారు రథయాత్ర


రాయగడ: రథం వద్ద ఎమ్మెల్యే అప్పలస్వామి తదితరులు


కొరాపుట్: కొరాపుట్‌లో రథయాత్రకి హాజరైన ప్రజలు


పర్లాకిమిడి: కాలేజీ జంక్షన్ వద్ద బలభద్ర, జగన్నాథ రథాలు


కొరాపుట్: బాహుడా యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు


పర్లాకిమిడి: ఫ్రెండ్స్ క్లబ్ తరపున రాజవీధిలో ఉచిత అన్న ప్రసాదాల పంపిణీ


కొరాపుట్: రథం లాగుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

రూ.1.38 కోట్లతో దంపతులు పరారీ


లబోదిబోమంటున్న బాధితులు

పర్లాకిమిడి: స్వయం సహాయక సంఘాలు, ఉద్యోగులు, రాజకీయ నాయకుల వద్ద నుంచి రూ.1.38 కోట్ల డబ్బులు తీసుకొని దంపతులు పరారైన ఘటన పట్టణంలో వెలుగు చూసింది. ఈ దంపతులు మహిళా స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు ఇస్తామని చెప్పి తొలుత రుణాలు మంజూరు చేయించారు. అనంతరం ఉద్యోగులు, రాజకీయ నాయకులకు అతి తక్కువ వడ్డీతో బంగారం కుదువపెట్టి రుణాలు మంజూరు చేసేవారు. ఆ తర్వాత వారి పేర్ల మీద ఎక్కువ మొత్తంలో వివిధ బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయించుకొని ఆ నగదుతో పరారయ్యారు. అయితే రుణాలు తీసుకున్న బ్యాంకులు నగదు కట్టాలని నోటీసులు జారీ చేయడంతో ప్రస్తుతం బాధితులంతా లబోదిబోమంటున్నారు. ఈ మోసం జరిగి నాలుగు నెలలు అవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ఒక స్వతంత్ర బృందం కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా వెల్లడించారు.

రాజ్‌భవన్‌లో వన మహోత్సవం

భువనేశ్వర్: వన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజ్ భవన్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామానంద పార్క్‌లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి మొక్క నాటి నీరు పోశారు. రాజ్ భవన్ అధికారులు, సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, రాజ్ భవన్ ప్రాంగణంలో అనేక మొక్కలు నాటారు. గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన మరియు పచ్చటి వాతావరణం అందించేందుకు వ్యక్తులు, సంస్థలు ఉత్సాహంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


మొక్కకు నీరుపోస్తున్న గవర్నర్ హరిబాబు కంభంపాటి

హోటళ్లపై అధికారుల దాడులు


హోటల్‌లో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న దృశ్యం

జయపురం: సబ్ డివిజన్ పరిధి కోట్‌పాడ్ ఎన్ఏసీలో హోటళ్లు, బేకరీలపై అధికారులు శనివారం దాడులు జరిపారు. హోటళ్ల వంట గదుల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, వంట నూనె వినియోగించాలని, పరిశుభ్రత పాటించాలని కోట్‌పాడ్ ఎన్ఏసీ కార్యనిర్వాహక అధికారి కమలేష్ మహంతి హోటల్ యజమానులకు సూచించారు. దాడుల్లో శానిటేషన్ అధికారి సుధీర్ కుమార్ నందో, గోపీ మఝి తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావు నేత్రాలు సజీవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో నివాసం ఉంటున్న పడాల నారాయణరావు(84) అనారోగ్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారులు పి.శ్రీనివాస్, పి.శ్రీకాంత్, కుమార్తె పి.శ్రీదేవిలు విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. డాక్టర్ కె.సుధీర్ పర్యవేక్షణలో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, పి.చిన్నికృష్ణల ద్వారా కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి పంపించారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్‌తో పాటు కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు సంప్రదించాలని కోరారు.

కమల దళపతి ఎవరో..?

- ఉత్కంఠగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక
- నేడు నోటిఫికేషన్ జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార పక్షం భారతీయ జనతా పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకోనుంది. కొత్త సారథిపై రాష్ట్ర రాజకీయ పక్షాలు పలు అంచనాలతో ఉన్నాయి. ప్రధానంగా ఈ వర్గాలు పాలక పార్టీ నాయకత్వ సారథ్యం యథాతథంగా కొనసాగుతుందా లేదా మార్పు వస్తుందా అనేది చూస్తున్నాయి. రానున్న 48 గంటల్లో ఈ ఉత్కంఠకు తెర పడుతుంది. దీనిలో భాగంగా ఆదివారం రాష్ట్ర శాఖ అధ్యక్షుడి ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ అవుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రతాప్ చంద్ర షడంగ తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మరియు కేంద్ర కార్యవర్గ సభ్యులుగా పోటీ చేసేందుకు ఈనెల 7వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు.

మూడేళ్ల పదవీ కాలం

కొత్త అధ్యక్షుడి సారథ్యంపై రాష్ట్రంలో బీజేపీ మనుగడ ముడిపడి ఉంది. ప్రభుత్వ కార్యకలాపాలు, పార్టీ, ప్రభుత్వ సంబంధాన్ని మరియు ఒడిశా రాజకీయ పరపతిని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఇప్పటివరకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్రంలో నరేంద్ర మోదీ, అమిత్ షా, రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ మధ్య అద్భుతమైన సమన్వయం ఫలిత ఆధారిత దక్షతను చాటుకుంది. మన్మోహన్ సామల్ తిరిగి ఎన్నికైతే ఈ పరిస్థితి యథాతథంగా కొనసాగే అవకాశం ఉంది. ఆయన పదవీ కాలంలో పలు కీలక అంశాలు హుందాగా పరిష్కరించబడ్డాయి. రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ పాలన పగ్గాలు చేపట్టినా ఎటువంటి ఒడిదుడుకులకు అవకాశం లేకుండా తన వంతు కర్తవ్యాన్ని దక్షతతో నిర్వహించి పార్టీ అంతర్గత వ్యవహారాల్ని వివాదరహితంగా నిర్వహించారు.

నాయకత్వం మారితే...

నాయకత్వం మారితే సమన్వయ సమీకరణాలు కొత్త పుంతలు తొక్కడం తథ్యం. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో కీలక అంశాలపై హోరా హోరీ పోరు కొనసాగుతోంది. కొత్త నాయకుని సారథ్యంలో బీజేపీ రాజకీయ వ్యూహం ఎలా ఉంటుందో పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొత్త అధ్యక్షుడికి వివిధ ప్రభావవంతమైన రాష్ట్ర నాయకులకు ఉన్న సామీప్యత పరిశీలనలోకి వస్తుంది.

రాష్ట్ర బీజేపీ తన ప్రస్తుత సమతుల్యతను కాపాడుకుంటుందా లేదా దాని అంతర్గత అధికార నిర్మాణాన్ని మరియు రాజకీయ వ్యూహాన్ని పునర్నిర్మించగల పరివర్తనను స్వీకరిస్తుందా అనే దానిపై అందరి దృష్టి ఉంది. రానున్న 48 గంటలు పార్టీ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయి. అవసరమైతే ఈనెల 8న ఎన్నికలు జరుగుతాయి. కొత్త రాష్ట్ర శాఖ ప్రముఖుడు (అధ్యక్షుడు) మరియు కేంద్ర మండలి సభ్యుల పేర్లను అదే రోజున ప్రకటిస్తామని ప్రతాప్ చంద్ర షడంగి తెలిపారు. పూరీలో రథయాత్రలో తొక్కిసలాట ఘటనతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మరియు కేంద్ర మండలి సభ్యుల ఎన్నిక స్వల్పంగా వాయిదా పడింది.

గాంధీజీ విగ్రహం ధ్వంసం


ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని 16వ వార్డు గాంధీ నగర్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఒక యువకుడు ధ్వంసం చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇది తెలిసిన వెంటనే పార్టీలకు అతీతంగా నాయకులు సంఘటన స్థలానికి వెళ్లి ఖండించారు. వెంటనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ విగ్రహాన్ని 1964లో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్ నాడర్ ఆవిష్కరించారని డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి పేర్కొన్నారు. దీనిని 1994లో స్వాతంత్ర్య సమరయోధుడు జగన్నాథ త్రిపాఠి పున ప్రతిష్ఠ చేశారన్నారు. అటువంటి చారిత్రాత్మక విగ్రహాన్ని మరలా పునః ప్రతిష్ఠ చేసేవరకు ఆందోళన చేస్తామన్నారు. దీంతో అక్కడే ఉన్న అన్ని పార్టీల నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అమిత్ ప్రధాన్(బీజేపీ), సుమిత్ పూజారి (బీజేడీ), అఖిల్ బోత్ర, బృందావన పండా, పారి సాహు, పిరోజ్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి చేరుకున్న మృతదేహాలు


అంబులెన్స్‌లో గ్రామానికి చేరుకున్న మృతదేహాలు


రోదిస్తున్న బంధువులు

కొరాపుట్: తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా పాశమయలారం వద్ద రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చనిపోయినవారి మృతదేహాలు స్వగ్రామానికి వచ్చాయి. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి భిక్ష పంచాయతీ కొదాబట్ట గ్రామానికి అంబులెన్సులు వచ్చాయి. ఈ గ్రామానికి చెందిన కృష్ణగౌడ కుమారుడు రమేష్ గౌడ (22), హరిశ్చంద్ర బోత్ర కుమారుడు చైతు బోత్ర (23)లు ఈ ఘటనలో మృతి చెందారు. ఇదే ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు ఆ పరిశ్రమలో పని చేస్తుండగా, ఆరోజు వీరిద్దరూ విధులకు వెళ్లడంతో మృత్యువాతపడ్డారు. వీరి అంత్యక్రియలకు తెలంగాణ ప్రభుత్వం కుటుంబానికి రూ.లక్ష పరిహారం అందించింది. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మజ్జి ప్రతీ కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ప్రకటించారు. సంబంధిత కంపెనీ ప్రతీ మృత కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించింది. వీరి మృతదేహాలు వస్తున్న విషయం తెలిసి సమీప గ్రామాల నుంచి వందలాది గిరిజనులు తరలివచ్చారు. ఇద్దరి మృతదేహాలకు ఒకేచోట అంత్యక్రియలు చేపట్టారు.

రథయాత్రలో కానిస్టేబుల్ మృతి


కానిస్టేబుల్ గొమాంగో మృతదేహం

రాయగడ: మారు రథయాత్రలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై కానిస్టేబుల్ మృతి చెందాడు. మృతుడు జిల్లాలోని పద్మపూర్ సమితి ఇఛ్చామొనొగుడ గ్రామానికి చెందిన తరణీ చరణ్ గొమాంగో(50)గా గుర్తించారు. స్థానిక కొత్త బస్టాండ్ కూడలిలో రథయాత్రను పురస్కరించుకుని ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న గొమాంగో శనివారం సాయంత్రం 7.30 గంటల సమయంలో అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఒకేరోజు ఇద్దరు కానిస్టేబుల్స్ మృతి చెందడంతో పోలీసు వర్గాల్లో తీవ్ర వేదన కనిపించింది.

ఆశ్రమ పాఠశాలలో భారీ కుంభకోణం



కొనుగోలు చేసిన ప్లేట్లను చూపిస్తున్న నాయకులు

- బీజేడీ నాయకుల ఆరోపణ

కొరాపుట్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల సామగ్రిలో భారీ కుంభకోణం జరిగిందని ప్రతిపక్ష బీజేడీ పార్టీ ఆరోపించింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ పార్టీ మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం 28 వేల ప్లేట్లు కొనుగోలు చేసిందన్నారు. కానీ వాటి వాస్తవ ధర రూ.120 కాగా, టెండర్ మాత్రం రూ.400లకి ఖరారు చేశారన్నారు. ఇలాంటి కుంభకోణం తాము ఏనాడు చూడలేదన్నారు. హాస్టల్‌లో ఉండే పెద్ద తోపేలా ఖరీదు రూ.3,200లు కాగా, దానిని రూ.11 వేలకి కొనుగోలు చేశారని మండిపడ్డారు. రూ.30 వేల దోమ తెరలను ఒక్కొక్కటీ రూ.2 వేలకు కొనుగోలు చేశారని, అయితే దోమ తెరలు రూ.2 వేలు ఎక్కడైనా ఉంటుందని ప్రశ్నించారు. ఇలా అనేక విధాలుగా విద్యార్థుల సొమ్మును కాజేశారని ఆరోపించారు. దీనిపై విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, నాయకులు సరోజ్ పాత్రో, భీమొ పూజారి, లల్లు త్రిపాఠి, దిలీప్ పండా, ప్రమోద్ రథ్, సుమిత్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి 'చేయూత'



ఏఆర్ కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సత్తిబాబు కుటుంబానికి పోలీసు శాఖ చేయూత కింద రూ.1,47,300ల విలువైన చెక్‌ను ఎస్పీ వకుల్ జిందల్ శనివారం అందజేశారు. ఈ మేరకు తన చాంబర్‌లో సత్తిబాబు భార్య బి.రాజేశ్వరికి దీన్ని అందజేశారు. సిబ్బంది ఈ మొత్తాన్ని సేకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మృతి చెందిన సిబ్బంది కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణంలో దొంగతనంపై ఆరా తీస్తున్న ఏఎస్‌ఐ

సంతకవిటి: మండల కేంద్రంలోని జీపీ వైన్స్‌లో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. పోలీసులు, దుకాణ యాజమాన్యం తెలిపిన వివరాలు.. మద్యం దుకాణం వెనుకన ఉన్న గోడకు శుక్రవారం రాత్రి కన్నం చేసి దొంగలు లోపలికి ప్రవేశించారు. తొలిత సీసీ కెమెరాను తప్పించి హార్డ్ డిస్క్‌తో పాటు రూ.14వేల నగదు, రూ.24 వేల విలువ చేసే మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం దుకాణం తెరిచిన సిబ్బంది చోరీ జరిగినట్టు గుర్తించి యాజమాన్యంకు తెలిపారు. దీంతో యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ వాసుదేవరావు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

లారీ బోల్తా పడి ట్రాఫిక్ జామ్



లారీని క్రేన్‌తో పక్కకు తప్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ సమీపంలో బొగ్గు లారీ శనివారం బోల్తా పడడంతో విశాఖ, రాయగడ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 8 గంటల సమయంలో బొబ్బిలి నుంచి విశాఖ వైపు వెళుతున్న బొగ్గు లారీ అదుపు తప్పి పారాది గ్రామ సమీపంలో బోల్తా పడింది. అప్పుడే విశాఖ నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ దానిని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న బురదలో చిక్కుకు పోయింది. దీంతో విశాఖ, రాయగడ వైపు వెళ్లే రహదారిలో అటు రామభద్రపురం, ఇటు గ్రోత్ సెంటర్ వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా రాకపోకలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు యథావిధిగా రాకపోకలు కొనసాగాయి.

ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: ఒడిశా ప్రాంతం పిప్పలభద్ర ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మండలంలోని కొందుకుప్ప, మూలిగూడ గ్రామాలకు చెందిన పలువురు గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాలోని రాయగడలో జరుగుతున్న రథయాత్రకు పై గ్రామాలకు చెందిన సుమారు 17 మంది ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలోని పిప్పలభద్ర ఘాట్ రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పి సైడ్ వాల్‌కు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందుకుప్పకు చెందిన పత్తిక సుమంతి, పత్తిక మన, జయంతితో పాటు మూలిగూడకు చెందిన పత్తిక శ్రీరాం, జీలకర్ర సరితలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వైద్య నిమిత్తం క్షతగాత్రులను కురుపాం ఆసుపత్రికి తరలించారు.

గోరపాడులోనే ఏనుగులు

సీతంపేట: గోరపాడు సమీపంలోనే ఏనుగులు ఘీంకారాలు చేస్తున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల గ్రామాల్లో నివాసముంటున్న గిరిజనులకు కంటి మీద కునుకు లేకుండా ఉందని స్థానికులు తెలిపారు. ఎప్పుడు ఏ క్షణాన గ్రామంలోకి వచ్చేస్తాయోమోనని ఆందోళన చెందుతున్నారు. కొండపోడు పనులకు సైతం నాలుగు రోజులుగా వెళ్లడం లేదని గిరిజనులు తెలిపారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.దాలినాయుడు ఆధ్వర్యంలో ట్రాకర్లు ఏనుగులు గమనాన్ని పరిశీలించి అటువైపు వెళ్లకుండా గిరిజనులను నియంత్రిస్తున్నారు.

పెంపకం.. కావాలి అప్రమత్తం..!


- పెంపుడు జంతువులపై పెరుగుతున్న ఆసక్తి
- జంతు సంక్రమిత వ్యాధులు వచ్చే అవకాశం
- పెంపకంపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ జునోసిస్ డే

రాజాం సిటీ/వేపాడ/గుమ్మలక్ష్మీపురం:

మానవ జీవనంలో జంతువులు సైతం భాగమయ్యాయి. మనిషి తన అవసరాల కోసం కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుందేళ్లు ఇలా రకరకాల జంతువులను పెంచుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు సరదాకు, ఇంటి కాపలాకు పరిమితమైన కుక్కల పెంపకం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. నేడు ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ...

పెరుగుతున్న ప్రేమ..

జంతు ప్రేమ రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రేమనైతే పంచుతున్నారుగాని వాటితో కలిగే వ్యాధుల గురించి పట్టించుకోవడంలేదు. వైద్య నిపుణుల పరిశోధన ప్రకారం జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇలా సోకే వ్యాధులను జునోసిస్ అంటారు. కుక్క కాటు ద్వారా రేబిస్, పందుల ద్వారా మెదడు వాపు, పశువులు, గొర్రెల నుంచి టీబీ వ్యాధులు సంక్రమిస్తాయని, వీటన్నింటిలో రేబిస్ వ్యాధి ప్రమాదకరమైనదిగా వైద్యులు పేర్కొంటున్నారు.



ఇటువంటి కుక్క పిల్లలకు టీకాలు తప్పనిసరి

జునోసిస్ ఎలా వచ్చిందంటే...

పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి. పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త 1885 జూలై 6న మొట్టమొదటిసారిగా యాంటీ రేబిస్ టీకాను ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడంతో ఆ రోజున ప్రపంచ జునోటిక్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

పిల్లల విషయంలో జాగ్రత్త...

పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు బయట తిరగకుండా చూసుకోవాలి. తమ పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయంలో ఇతరులుపై దాడి చేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి.

వ్యాక్సినేషన్ వేయించాలి

పెంపుడు జంతువులకు వేసే వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొంతమంది ఖర్చుతో కూడినదని పట్టించుకోరు. పెట్స్‌కు మామూలుగా కరిచే గుణం ఉంటుంది. కాబట్టి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించాలి. మనిషి, జంతువుకు ఉండే కాంటాక్ట్‌లో అది కరవడం, గీరడం వంటివి సాధారణంగా జరుగుతుంటాయి. దాని వల్ల ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. కుక్కలు, పిల్లలు పెంచుతున్న వారు కూడా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తించాలి.

వైద్యుల సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలను జునాటిక్ డిసీజస్ అంటారు. ఎబోలా, బర్డ్ ఫ్లూ, రేబిస్, మెదడు వాపు వంటివి జునోటిక్ వ్యాధులే. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే రెగ్యులర్‌గా వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇంట్లో కుక్కలు పెంపకం చేపట్టిన వారు చర్మ సమస్యలు వస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు.

– డాక్టర్ బి.జయప్రకాష్,
ఏడీ, పశుసంవర్ధకశాఖ, రాజాం

కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీసు శాఖలో క్రియాశీలకమైన స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో జి ఎస్పీ మాధవ్ రెడ్డి శనివారం తన కార్యాలయంలో సమావేశమై వారు క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఎస్‌బీ నిర్వహించాల్సిన విధులపై కొన్ని మార్గదర్శకాలు చేశారని డీజీపీ ఆలోచనల మేరకు జిల్లాలో వాటిని పరిగణనలోకి తీసుకొని జిల్లా ఎస్‌బీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) పోలీసుల పనితీరు చాలా క్రియాశీలకమన్నారు. కచ్చితమైన సమాచారాన్ని సేకరించేందుకు సోర్సు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వారితో మమేకమై అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. సేకరించిన విషయాలను రికార్డు రూపంలో భద్రపరుచుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.

కార్యకలాపాలపై మరింత దృష్టి

గ్రామ, వార్డు స్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయ వివాదాలు అతిథుల రాకపోకల సమాచారం వారియొక్క ప్రతీ కార్యక్రమం, ధర్నాలు, కక్షలు, భూ తగాదాలు, మత సంబంధమైన గ్రూపుల యొక్క సమాచారం ముందస్తుగా సేకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముందుగా గుర్తించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ పక్షపాతి ధోరణి లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ రంగనాధం, ఎస్‌బీ ఎక్స్ సీఐ రమేష్, ఎస్ఐలు దినకర్, రాజు, శంకరరావు, ఇతర పోలీసు అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ

- ట్రిపుల్ గోల్డ్ చాంపియన్‌గా నిలిచిన భవాని

నెల్లిమర్ల రూరల్/విజయనగరం: కజఖస్తాన్‌లో ఈ నెల 4 నుంచి జరుగుతున్న ఏషియన్ జూనియర్, యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి సత్తా చాటింది. విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామానికి చెందిన రెడ్డి భవాని శనివారం నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఒకేసారి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. స్నాచ్‌లో 69 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కేజీలు..మొత్తంగా 159 కేజీల బరువును లేపి ట్రిపుల్ గోల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణికు రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు బెల్లాన లక్ష్మి, కోచ్ చల్లా రాము, గ్రామస్తులు అభినందించారు.



సాధించిన బంగారు పతకాలతో వెయిట్‌లిఫ్టర్ భవాని

లోక్ అదాలత్‌లో 116 కేసుల రాజీ



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 116 కేసులను ఇరువురు అంగీకారంతో రాజీ చేసినట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి మార్గదర్శిగా ఉపయోగపడుతుందన్నారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో సుమారు రూ.18,24,808ల విలువైన కేసులలో రాజీ చేసినట్టు వివరించారు. అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యా జాస్పిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రకుమార్, బార్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు ఉన్నాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ కుటుంబాలను మార్గదర్శితో సమన్వయం చేయాలని ఆయనన్నారు. ప్రభుత్వం బంగారు కుటుంబాలను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసిందన్నారు. శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించి, కుటుంబాన్ని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి నిబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గ స్థాయి వర్క్ షాప్‌లు జిల్లాలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబం, మార్గదర్శి మధ్య అంతరాన్ని పూడ్చడానికి అధికారిక బృందం స్ఫూర్తితో పని చేయాలన్నారు. యోగాంధ్రలో జిల్లా బృందం చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. జిల్లాను ఒక నమూనాగా ఉంచడానికి మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమంలో అదే స్ఫూర్తితో పని చేయాలని ఆయన కోరారు. మనస్సుతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇళ్లను మార్గదర్శితో మ్యాప్ చేయాలని ఆయనన్నారు. పనిని పర్యవేక్షించడానికి సిబ్బందిలో ఒకరిని కన్వీనర్‌గా నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారని ఆయన అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మాట్లాడుతూ పీ4 వెబ్‌సైట్‌లో మార్గదర్శిగా నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, ఆర్‌బీఎస్‌కె ప్రాజెక్టు అధికారి డా. టి.జగన్‌మోహన్‌రావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు, ఈపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజినీర్ కె.వేణుగోపాల్‌నాయుడు, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిప్యూటీ డీఈ రెడ్డి పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శనివారం ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 2,232 పాఠశాల నుంచి 2,10,377 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా ఈ సమావేశాలను నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. జిల్లాలోని 180 జూనియర్ కళాశాలల నుంచి 38,478 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సహా హాజరు కావాలన్నారు. పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్‌ను కూడా ఇస్తారని ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పండగలా నిర్వహించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమాల పర్యవేక్షణకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 17 కమిటీలను నియమించడం జరుగుతుందని జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

రూ.4.67 కోట్లతో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు

జిల్లాలోని 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మత్తులకు రూ.4.67 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించి పనుల ప్రగతిపైన, విద్యార్థుల హాజరు శాతంపైనా సమీక్షించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎం.అన్నపూర్ణ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, వసతిగృహాల సంక్షేమాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఏం కష్టం వచ్చిందో..

- రాజాంలో కొప్పర యువకుడి ఆత్మహత్య
- కడుపు నొప్పి భరించలేకనే ఈ ఘోరం అంటూ తండ్రి ఫిర్యాదు
- మృతుడి వద్ద సూసైడ్ నోట్ లభ్యం

రాజాం సిటీ : 'తాతయ్య, అమ్మ, నాన్న అందరూ నన్ను క్షమించండి. నేను ఒక సమస్యలో ఇరుక్కున్నాను.. అందువల్ల ఇలా చేస్తున్నాను.. ఇందులో నా తప్పు లేదు.. ఎవరినీ మోసం చేయలేదు.. నేను చేసిన తప్పుకు ఇదే పరిష్కారం.. నన్ను క్షమించండి.. పవన్ జాగ్రత్తగా ఉండు.. ఎవరి దగ్గరా మోసపోవద్దు.. తాతయ్య, అమ్మ, నాన్న, అక్కను జాగ్రత్తగా చూసుకో.. నేను లేని లోటు నువ్వు తీర్చు.. అందర్ని జాగ్రత్తగా చూసుకో...'
ఇది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకునే ముందు తన కుటుంబీకులకు రాసిన సూసైడ్ నోట్.

ఏం కష్టం వచ్చిందో తెలియదుకానీ ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు సరైన కారణాలు తెలియరానప్పటికీ మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజాం పట్టణ ఎస్ఐ వై.రవికిరణ్‌తో పాటు స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగర మండలం కొప్పర గ్రామానికి చెందిన బూరి శ్రీనివాసరావు(29) రాజాం పట్టణంలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా జాబ్ చేస్తున్నాడు. ఈయన బీటెక్ పూర్తి చేసి, ఉన్నత ఉద్యోగాలు నిమిత్తం ప్రయత్నిస్తున్నాడు. ఇంటికి తను భారంగా ఉండకూడదని భావించి ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. 15 రోజుల క్రితం రాజాం పట్టణంలో తెలగవీధిలోని నివాసముంటున్న తన స్నేహితులు వద్దకు వచ్చి ఇక్కడే రూమ్‌లో ఉంటున్నాడు. ఇదే సమయంలో వ్యక్తిగత పనుల నిమిత్తం రెండు రోజుల క్రితం అతని స్నేహితులు బయటకు వెళ్లారు. ఇంతలో శ్రీనివాసరావు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అతని తండ్రి నారాయణరావుకు అనుమానం వచ్చింది. తన కుమారుడు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని అతని స్నేహితులకు నారాయణరావు ఫోన్ చేయగా, వారు వచ్చి చూడగా గదిలో ఫ్యాన్‌కు శ్రీనివాసరావు ఉరి వేసుకుని ఉన్నాడు. ఈ విషయాన్ని వెంటనే అతని తల్లిదండ్రులతో పాటు పోలీసులకు స్నేహితులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు తండ్రి నారాయణరావుతో పాటు బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడి మృతిని జీర్ణించుకోలేక నారాయణరావు సొమ్మసిల్లిపడిపోయాడు. తన కుమారుడు కొద్ది నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడని, ఈమేరకు గ్రామంలో నాటు వైద్యం కూడా చేయించుకుంటున్నాడని పోలీసులకు తెలిపాడు. రాజాం వచ్చి ఉంటున్న తన కుమారుడు ఫోన్ ఉదయం స్విచ్ ఆఫ్ చేసి రావడంతో అనుమానం వచ్చి అతని స్నేహితులకు సమాచారం ఇచ్చామని, ఇంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చిందని వాపోయాడు. తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. శ్రీనివాసరావు ఉరి వేసుకుని ఒక రోజు దాటి ఉండవచ్చునని అనుమానం వ్యక్తంచేసారు. రాజాం ఏరియా ఆసుపత్రిలో శవ పంచనామా అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.



రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న శ్రీనివాసరావు


కొప్పరలో విషాదం

వంగర : మండలంలో కొప్పర గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన బూరి శ్రీనివాసరావు రాజాం పట్టణంలో తన స్నేహితులు గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయం తెలియగానే గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. శ్రీనివాసరావు ఇంటి వద్ద జనందోహం ఏర్పడింది. శ్రీనివాసరావు మృతదేహం గ్రామానికి చేరుకోగానే తల్లిదండ్రులు మజ్జిగౌరి, నారాయణరావులతో పాటు సోదరుడు పవన్‌కళ్యాణ్‌లు కన్నీరుమున్నీరుగా రోదించారు.

పోలీసులకు చిక్కిన గంజాయి నిందితుడు

విజయనగరం క్రైమ్: నగరంలోని అయ్యన్నపేట వద్ద గల వాకింగ్ ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి గంజాయితో వన్‌టౌన్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. వాకింగ్ ట్రాక్ వద్ద ఓ వ్యక్తి అనుమానితంగా సంచరిస్తుండడాన్ని ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ శనివారం గుర్తించారు. ఆయన వద్ద ఒక కత్తి, తపంచా ఉండడాన్ని చూసి ప్రశ్నించడంతో పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఎస్ఐ పట్టుకొని సోదా చేయగా మూడు కేజీల గంజాయి ప్యాకెట్లు అతని వద్ద లభ్యమయ్యాయి. ఈ వ్యక్తిని విజయనగరం ఎల్‌బీజీ నగర్‌కు చెందిన మజ్జి కృష్ణవర్ధన్‌గా గుర్తించారు. రాయఘడ నుంచి గంజాయి కొనుగోలు చేసి విజయనగరంలో విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. పోలీసులకు పట్టుబడ్డాడు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ నిందితుడిని విచారించారు. కత్తి, తపంచా, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఇతనిపై గతంలో రౌడీ షీట్ ఉందని సీఐ చెప్పారు.

గోతుల గండం.. నరక ప్రయాణం



చిత్రంలో పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తున్నది బొబ్బిలి నుంచి రాజాం వైపు వెళ్లే రోడ్డు. సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. దీనిపై రాకపోకలకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గోతుల్లో వాహనాలు కూరుకుపోతుండడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. సంక్రాంతికి అద్దం లాంటి రహదారులని హామీ ఇచ్చిన కూటమి పాలకుల మాటలు పచ్చిఅబద్ధాలని చెప్పేందుకు ఈ రోడ్డే నిదర్శనమంటూ ఈ ప్రాంతీయులు విమర్శిస్తున్నారు. కనీసం గోతులు పూడ్చే పనులైనా చెపట్టాలంటూ కోటలో కాలంవెళ్లదీస్తున్న పాలకులకు వినిపించేలా నినదిస్తున్నారు.

– బొబ్బిలిరూరల్

పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకొండ రూరల్: అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం విజిలెన్స్ అధికారులు మెరుపుదాడితో పట్టుకున్నారు. ఆ శాఖ ఎస్ఐ రామారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం నుంచి ఓ వ్యాన్‌లో ఒడిశాకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. దీంతో అధికారులు ఆ రహదారిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. పాలకొండ కార్గిల్ పాయింట్ వద్ద గల మార్కెట్ కమిటీకి చెందిన చెక్‌పోస్టు వద్ద మాటు వేసిన విజిలెన్స్ అధికారులు వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టుబడ్డాయని తెలిపారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.లక్ష 7వేల వరకూ ఉంటుందని అధికారులు లెక్క కట్టారు. పట్టుబడిన వాహనం సీజ్ చేయటంతో పాటు అందులో తరలించే యత్నం చేసిన బియ్యం బస్తాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పజెప్పామని ఎస్ఐ తెలిపారు. ఆ శాఖ సిబ్బంది లక్ష్మీనారాయణ, కన్నబాబు, శ్రీనుబాబు తదితరులున్నారు.



పట్టుబడిన బియ్యం రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు

తరలిస్తారా.. చావమంటారా..!



నివాసాల పక్కనే నిర్వహిస్తున్న కోళ్లఫారాల నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నాం.. వ్యాధుల బారిన పడుతున్నాం.. పిల్లలకు తిండి సైతం సహించడం లేదు.. తక్షణమే ఇక్కడ నుంచి కోళ్ల ఫారాలను తరలిస్తారా.. లేదంటే సామూహికంగా చావమంటారా అంటూ బిరసాడవలస గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలంతా కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేశారు. ఇప్పటికే 31 రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు అంటూ మెంటాడలో పర్యటించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సైతం గిరిజనుల ఆందోళన, ఆవేదనను పట్టించుకోకుండా వెళ్లిపోవడంపై నిరసన తెలిపారు. తక్షణమే కోళ్లఫారాలు తరలించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని గిరిజన నాయకులు సుకరయ్య, స్థానిక నాయకుడు రెడ్డి రాజప్పలనాయుడు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గిరిజనుల దీక్షశిబిరాన్ని పట్టించుకోకుండా వెళ్లిపోయిన మంత్రి తీరును తప్పుబట్టారు.

– మెంటాడ

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం: మహారాష్ట్రలో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్-10, 12 వయస్సు విభాగాల్లో తలపడేందుకు ఏపీ జట్టుకు ఎంపికైన దేశిక్, జాయ్ జబేజ్, హసీనా, శ్రీవల్లి శనివారం బయలుదేరారు. క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన శిక్షకుడు డీవీ చారి ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి